

# పరిణీత

## గొల్లపూడి మారుతీరావు

అసలు చిన్నమ్మ పరిచయమే అతి విచిత్రమయిన పరిస్థితుల్లో, విచిత్రంగా జరిగింది. ఆ తరువాత నేను తేరుకొని మా మూలు స్థితికి రాలేకపోయాను. చిన్నమ్మను మరో విధంగా చూడలేక పోయాను. అది చిన్నమ్మలో ప్రత్యేకత అయి ఒకరిని దూరం చేస్తే, అది మరొకరికి లోపమయి దూరంచేసింది. మనిషి వ్యక్తిత్వం అవ్యక్తి కెలా శత్రువవుతుందో మొదటిసారిగా అర్థమయిన సందర్భమది.

* ○ ○

ఆ వూరు వచ్చిన రెండు వారాలకి చిన్నమ్మ తటస్థపడింది. ఆఫీసునుంచి యింటికి వచ్చాను. నా పడకగదిలో నా మంచానికి అనుకొని ఏదో పత్రిక తిరగవేస్తోంది చిన్నమ్మ. చూస్తూనే ఎవరో పొరుగింటావిడ అనుకొన్నాను. చక్కగా దువ్విన తల. పిన్నులు పెట్టి వేసుకొన్న సిగ, సిగలో కనకాంబరాలు. నన్ను చూసి చటుక్కున లేచినిలబడింది.

నేనూ కంగారుపడి "పరావా లేదు–కూర్చోండి" అని హాల్లోనే బూట్లు విప్పుకున్నాను. ఆమె వసారాలోకి వచ్చేసింది. స్తంభందగ్గర నిలబడి ఉండడం చూసి కొంచెం యిబ్బందిపడ్డాను. మా ఆవిడ జాడ లేదు. లోపలికి వెళ్లి ఓ కుర్చీతెచ్చి వసారాలో వేశాను కూర్చోమని. నాకంటె ఎక్కువ కంగారుపడిపోయింది ఆవిడ. "పరవా లేదండీ" అంది.

"కూర్చోండి. ఆవిడ ఎక్కడికి వెళ్లిందో మరి" అన్నాను.

పరవాలేదంటుందే కాని వెళ్లదు. మా ఆవిడతో ఏదయినా పని వుందేమో. ఎక్కడికి వెళ్లిందో?

ఆలోచన అర్థమయినట్టు–"వీధి చివర కిరాణా దుకాణానికి వెళ్లారండి!" అంది.

కాళ్లు, మొహం కడుక్కోవాలంటే వసారాలోంచి వెళ్లాలి. ఆవిడ అక్కడే వుంది. ఏం చెయ్యాలో తెలీక బట్టల్తోనే సోఫాలో కూలబడ్డాను. ఇద్దరం నిశ్శబ్దంగా వున్నాం. కాని ఎంతసేపు?

"మీ ఆయన ఈ వూళ్లోనే పని చేస్తున్నారా!" అన్నాను ఏదో మాట్లాడాలి కనక.

"లేదండి."

"వ్యాపారమా?"

"కాదండీ."

"మరేం చేస్తున్నారు?"

"ఏమీలేదండి."

ప్రశ్నకి ముక్తసరిగా సమాధానం చెప్పింది. ఏం చెయ్యాలో అర్థంకాలేదు. ఏం మాట్లాడాలో అంతకన్నా అర్థం కాలేదు. ఆమెని తేరిపార చూశాను. కాస్త నల్లటి మనిషే. నుదుటిన కెంపులాటి బొట్టు. ఎదురుగా తలెత్తి ముఖంలోకి చూడలేదు కాని పక్కలకి చూసినప్పుడు కళ్లలో తెలుపు కొట్టవచ్చినట్టు కనిపిస్తోంది. గంభీరమయిన ముఖం. కాస వెలిసిన ఆకుపచ్చరంగు పట్టుచీర. ఒకటిరెండు చోట్ల చిరిగింది. కాస్త మాసింది. కాని యిళ్లలో పట్టుచీరెలు ఈ రోజుల్లో ఎవరు కట్టుకుంటున్నారు? ఎవరో ధనవంతులో దక్షిణాదివాళ్లో అయి వుండాలనుకున్నాను. కాని మద్రాసు లక్షణాలు ఏమీ కనిపించలేదు. మద్రాసీ ఆడవాళ్లకి ముక్కుబేసరీ అందమయిన, ప్రత్యేకమయిన అలంకారం. ఆవిడకది లేదు.

కొందరుఆడవాళ్ల మౌనం గాంభీర్యాన్నిస్తుంది. కొందరిలో అది పిరికితనంలాగ, చపలత్వంలాగ కనిపిస్తుంది. కొందరిలో అది అహంకారం లాగాను కనిపిస్తుంది. కాని ఆవిడకి అతికినట్టుగా వుంది. నేను అక్కడ ఉన్నానన్న స్పృహ ఆమెని ఎంతో కొంత సిగ్గుపడేట్టు చేస్తోందని తెలిసి డాబామీదికి వెళ్లి నిలబడ్డాను. మరో అయిదు నిముషాలకి వచ్చింది మా ఆవిడ.

"ఎక్కడి కెళ్లావు యింట్లో పెద్ద మనిషిని కూర్చోపెట్టి? నీకోసం పాపం,

ఎంత సేపటినుంచి ఎదురుచూస్తున్నారో తెలుసా?" అన్నాను కోపంగా.

"ఎవరండీ ఎదురుచూసేది?"

"గదిలో కూర్చున్నారు ఆవిడ. కుర్చీ వేసి వసారాలో కూర్చోమన్నా కూర్చోలేదు." అన్నాను.

మా ఆవిడ ఒకటే నవ్వు- నిలబడిన అవిడవేపు తిరిగి "చిన్నమ్మా- పెరటి వేపు రా, అంట్లు పడేస్తాను-" అంది, ఇంకా నవ్వుతూనే,

నేను విర్రాంతపోయాను. చిన్నమ్మ పనిమనిషి అని అప్పటికి అర్థమయింది. "ఏం చేశారూ? పనిమనిషికి కుర్చీవేసి కూర్చోమన్నారా?" అంటూ వెక్కిరిస్తోంది మా ఆవిడ. కొంగు నడుంచుట్టూ తిప్పుకొని పెరటివేపు నడుస్తున్న చిన్నమ్మని యింకా షాక్ అయి చూస్తూనే వున్నాను.

"పాపం, ఆవిడది సామర్లకోటటండీ- మొగుడు వదిలేశాడు. ఓ కూతురు, ముసలి తల్లి- పనంతా తల్లి చేస్తుందనుకోండి- తనూ చెయ్యిసాయంగా వుంటుంది." అంటూ వివరించింది మా ఆవిడ.

"మొగుడు ఎందుకు వదిలేశాడు?"

"ఎందుకేమిటి- పోయేకాలం. దాన్ని చూస్తే బంగారపు బొమ్మలాగ వుంది. బుద్ధిమంతురాలు. అలాంటిదాన్ని వదిలేసి ఏం బావుకుంటాడో పిచ్చిముండాకొడుకు." అతిక్రూరంగా, ఆ కనిపించని మొగుడు మీద విరుచుకుపడిపోయింది మా ఆవిడ.

చిన్నమ్మ కూతుర్ని చూశాను. మూడేళ్ల పిల్ల. చిన్నమ్మకు ఉన్న నాజూకుతనం లేదు. ముఖం కాస్త కరుకుగా వుంది. కళ్లు చిన్నవి. తండ్రి పోలికలు ఎక్కువగా వచ్చి వుంటాయి. చిన్నమ్మ కూతురని తెలిశాక చూశాను కాని లేదా ఆ పాపని వేరుగా చూసి వుంటే ఏ కలవారి అమ్మాయో అనిపించేంత ముద్దుగా పరికిణీ జాకెట్టు వేసుకొని వుంది. బట్టలు ఖరీదయినవి కావు. కాని ముచ్చటగా వున్నాయి. పొద్దుటే పనిలోకి వచ్చేసరికే కూతుర్ని అలంకరించి, కాటుక, బొట్టు దిద్ది తనతో తీసుకు వస్తుంది చిన్నమ్మ. పాపని చూసి చిన్నమ్మని చూస్తే ఇరవై ఏళ్లు దాటి వుంటాయనిపిస్తుంది కాని, లేకపోతే మరీ చిన్నదానిలాగ వుంటుంది చిన్నమ్మ. చిన్నమ్మలో ప్రత్యేకత ఆమె మౌనం. రెండుమూడు మాటలు తప్ప ఎక్కువ మాట్లాడడం ఎన్నడూ గమనించలేదు. మితభాషి అనుకున్నాను కాని, మరొక రోజు ఆఫీసునుంచి వచ్చేసరికి అద్భుతంగా ఏదో సినిమా పాట పాడుతోంది. మా ఆవిడ కూర తరుగుకుంటూ వింటోంది. చిన్నమ్మలో వున్న మరొక ఆకర్షణ అప్పుడు అర్థమయింది. నన్ను చూసి మరీ సిగ్గు ముంచుకొచ్చింది గావును. పక్కుమని నవ్వేసింది. చిన్నమ్మ నవ్వితే హఠాత్తుగా పదిహేనేళ్ల అమ్మాయయిపోతుంది. అంత చిన్న పళ్లు. చక్కటి పలువరుస. ఆమెలో గాంభీర్యమంతా మూసిన పెదాలదే.

దేవుడిని భక్తితో, నమ్రతతో గౌరవించడంలో తృప్తి వుంది. ఆఫీసరుని గౌరవించడంలో యిబ్బంది వుంది. మా ఆవిడ నిరాటంకంగా 'నువ్వు' అంటుంది కాని, నేను మాత్రం ఏకవచనంలో పిలవలేకపోయాను. కాకపోతే ఆ అవసరం కూడా, నాకు ఎక్కువ లేదు కనక బతికిపోయాను. ఏమయినా ఏదో శాపవశాత్తూ కూలిపోయిన కుటుంబంలోంచి వచ్చిన పెద్దింటి అమ్మాయి యింట్లో తచ్చాడుతున్న అనుభూతే కలిగేది- చిన్నమ్మ తారసపడినప్పుడల్లా.

కూతుర్ని ఎత్తుకుని మా ఆవిడతో, పొరుగిళ్లవాళ్లతో నడిస్తే- ఆవిడ పనిమనిషి అని ఎవరూ అనుకోరు. అలాగే వాళ్లతోపాటే వాళ్ల భాషలో మాట్లాడుతుంది. మాటలో యాసలేదు. వాళ్లు మాట్లాడుకొనే విషయాలే మాట్లాడుతుంది.

మరి యిలాంటి వ్యక్తిని భర్త ఎందుకు వదిలేశాడు? లోపం చిన్నమ్మదా? భర్తదా?

"దాని మొగుడు ఏం చేస్తూంటాడు?" అన్నాను మా ఆవిడని. మా ఆవిడ నవ్వింది. "దాన్నే అడగండి" అంది.

"ఏం నువ్వు చెప్పకూడదనా?"

"అబ్బ- అడగండి. ఎందుకడగమన్నానో మీకు తెలుస్తుంది" అంది ముసిముసి నవ్వులు నవ్వుతూ.

పెరట్లో నీళ్లపొయ్యి రాజేస్తుండగా అడిగాను.

"మీ ఆయన ఎక్కడున్నాడు?"

నా గొంతు విని తుళ్లిపడింది. నా ముఖం కూడా చూడలేదు. వణికిపోయింది. మాట్లాడడానికి గొంతు పగిలింది. "ఇక్కడే" అంది.

"నువ్వూ- మీ- మీ యిద్దరూ ఒకే చోట వుంటారా?"

తల అడ్డంగా తిప్పింది. అప్పటికి అడగాలనుకున్న అసలు ప్రశ్న వేశాను.

"ఏం?"

ఆ తత్తరపాటు చూసి ప్రశ్న వినగానే భోరుమంటుంది అనుకున్నాను. కాని ఆశ్చర్యంగా, ఆమె ముఖంలో నరాలన్నీ బిగుసుకున్నాయి. నల్లటి ముఖంలో కోపం కొట్టవచ్చినట్టు తెలిసింది. అవకాశం దొరికితే అక్కడినుంచి పారిపోవాలని దారులు వెదుకుతున్నాయి కళ్లు. చాలాసేపు నేనే మాట్లాడాను.

"ఏంలేదు. అతనితో అవసరమయితే మాట్లాడతాను."

"ఛీఛీ! వాడితో మాట్లాడేదేమిటి? వాడు మన మధ్య ఉండాల్సిన మనిషి కాదు." అంటూ చరాచరా వెళ్లిపోయింది.

నన్ను ఎప్పుడూ 'బాబుగారూ' అని పిలవలేదు. కాగా భర్తని 'వాడు' అంటోంది. నా పక్కనుంచి వెళ్తుంటే దూసుకు కదిలిన గాలికెరటం తెలిసింది. వెనకనే మా అవిడ నవ్వుతూ వచ్చి నిలబడింది.

"కారణం ఏమిటంటావు ?"

"నన్నడుగుతారేం ? నాకూ అలాగే సమాధానం చెప్పింది. రాళ్లు కొడతాడట. ఏడుకొండలు పేరు. ఆంజనేయస్వామి గుడిపక్క హోటల్ కడుతున్నారు చూడండి. అక్కడ పనిచేస్తున్నాడు."

"ఇవన్నీ నీకెలా తెలిసింది."

"వాళ్లమ్మ చెప్పింది."

అప్పుడు జ్ఞాపకంవచ్చింది, వాళ్లమ్మ వుందని. నే నెప్పుడూ చూడలేదే !-

"నిన్ననే వచ్చింది. అడిగాను."

"ఎందుకేవిటమ్మా. నా ఖర్మ. వాడు చాలా మంచోడు. ఇదీ మంచిదే. ఆళ్లకి కుదరలేదు. అంతే" అందిట.

చిన్నమ్మ తల్లి ఎలా వుంటుంది ? అక్కడా అక్కడా నెరిసిన జుత్తుతో, నున్నగా దువ్విన తలతో, మల్లెపువ్వులతో, వెలిసిన పట్టుచీరెతో -ఇదంతా నా ఆలోచన.

కాని చిట్టెమ్మని చూసి నిర్ఘాంతపోయాను. శోష వచ్చినంత పనయింది. అతి భయంకరమైన దారిద్ర్యం, అపరిశుభ్రత, కుసంస్కారం, అనాగరికత యిలా ఎన్నయినా చేర్చవచ్చు. అన్నీ ఆమె అవతారంలో తాండవిస్తున్నాయి. అట్టకట్టిన చింపిరి తల. మిదికి ఎగదోసిన నార చీరె. దాని రంగు కూడా తెలీకుండా దుమ్ముపట్టి వుంది. ముందు రెండు పళ్లూ పోయాయి. పొగాకు నములుతుంది బొద్దుకి సగం కొరికిన పొగాకు కాడ- కాస్త జాగ్రత్తగా వింటే తప్ప అర్థంకాని ఏస. మరి చిన్నమ్మలో సంస్కారం ఎవరిది ? వాకబు చేస్తే అర్థమయింది. చిట్టెమ్మ మొగడు నేవీలో పనిచేశాడు. సింగపూర్ వెళ్లిన షిప్పులోనే ఓసారి మరణించాడు. సముద్రంలోనే శవాన్ని పారేశారు. చూడని ఆనే ఏమనిషి సంస్కారం ఆ చిన్నమ్మదయితే ఏ భర్తయినా నెత్తిమీద పెట్టుకొని ఆరాధించవలసిందే. ఆ స్థాయి మనుషుల్లో తలమానికంగా వుంది చిన్నమ్మ. ఏ భర్తకయినా ఆమె గర్వకారణం కావాలి. అలాంటిది భర్తతో కుదరని 'అంశం' ఏమిటి ? చిన్నమ్మ ఏమయినా కాలుజారే మనిషా ? ఆ ప్రశ్నకి సమాధానం మరో పదిరోజుల్లో దొరికింది.

మా ఆవిడ పినమామగారు కల్నల్ హయగ్రీవరావుగారు మా యింట్లో బస చేశారు. గవర్నమెంటు యివ్వాల్సిన పెన్షన్‌లో ఆరు రూపాయలు తక్కువయాయని బరంపురం నుంచి వచ్చారు- ప్రభుత్వంతో మంతనాలకి. ఆయనతో పాటు మిలటిరీలో పనిచేసి రిటైరయిన అర్దర్లీ వచ్చారు. మిలటరీలో ఉండేటప్పటి అలవాట్లు పోలేదు. పేరు రాస బీహారీ. బరంపురం మనిషి. యువకుడు. పండా. బరంపురం కారా బిగిస్తాడు. ఎప్పుడూ నవ్వుతూ ఉంటాడు. ఆయన ఉన్న అయిదారురోజులూ యింటిల్లపాది దుంప తెంచేశాడు. పడుకునే ముందు ఫాన్ కింద మంచం, దోమతెర, తెరలోంచి దూసుకువచ్చిన దోమలు కరవకుండా వొంటికి మందు, చెవుల్లో దూది ఇవన్నీ కాక ఓ 'కాంపోజ్' మాత్ర- అంతా పెద్ద తతంగం- ఇలాగే ఉదయం 'ఛా' ఆదెలా తయ్యారుచెయ్యాలో మా అవిడకి ఉపన్యాసం యిచ్చారు. ఆవిడని కట్టుకున్న కారణానికి నన్ను వస్తూనే మరో అర్దర్లీని చేసేశాడు.

"చూడు బాబ్జీ ! ఆఫీసునుంచి వచ్చేటప్పుడు బాదంపప్పు తీసుకురా. బాదం పప్పు అంటే ఎలాంటిదనుకున్నావు- మేం చిట్టంగాగ్‌లో పనిచేసే రోజుల్లో-" యిలా సాగేది ఆయన ధోరణి.

మిలటరీలో పనిచెయ్యలేదు కాని, ఆయనంత హుషారుగా ఆయన మనస్సులో మరో నిముషంలో రాబోయే ఆలోచనని ముందే కనిపెట్టి పనిచేపేపే వాడు బిహారీ. చక్కగా తెలుగు మాట్లాడుతాడు. వాడు చిన్నమ్మని చూసి మొదట ఆశ్చర్యపోయాడు. ప్రతీ పనికీ చిన్నమే దారి చూపించాలి. మాట కలిపాడు. వీలయినంత వరకు సంజ్ఞలతోనే పనిచేసుకుపోయింది చిన్నమ్మ. అతి తక్కువ మాట్లాడే అలవాటుని మరింత పెంచింది బిహారీ విషయంలో. చిన్నమ్మ కూతుర్ని నాలుగు రోజుల్లోనే బాగా మచ్చికచేశాడు- భుజంమీద ఎక్కించుకొని పెరడంతా పరుగులు తీశాడు- కూతురి కోసమయినా బిహారీతో మాట్లాడక తప్పలేదు చిన్నమ్మ.

ఏం జరిగిందో ఏమో- ఓ రోజు సాయంకాలం నేను ఫలహారం చేసి చేతులు కడుక్కోడానికి పెరట్లోకి వచ్చినప్పుడు చీపురుకట్ట పట్టుకుని బిహారీని చావబాదుతోంది చిన్నమ్మ. నిర్ఘాంతపోయాను. నుయ్యి చుట్టూ పరిగెత్తాడు. కాని బొగ్గుల కొట్టాం దగ్గర దొరికి పోయాడు. వాడి జుత్తు పట్టుకుని ఉతికింది. విశేషమేమిటంటే కొడుతూ చిన్నమ్మ మాట్లాడదు, దెబ్బలు తింటూ బిహారీ మాట్లాడడు. అంతా గంభీరమయిన కోల్డ్‌వార్ లాగ సాగింది. "ఏవిటి ? ఏం జరిగింది ?" అన్నాను- నన్ను చూసి బిహారీని వదిలేసింది. సందు చూసుకుని బిహారీ దాటేశాడు. నాతో ఒక్క మాటయినా చెప్పలేదు. కొంగుని నడుంచుట్టూ తిప్పుకొని తల వొంచుకుని అక్కడినుంచి వెళ్లిపోయింది.

తర్వాత మా ఆవిడ వాకబు చేసి కనుక్కున్న విషయం-చిన్న పిల్లకి తను

అన్నం తినిపిస్తూ మెల్లగా పెళ్ళిమాటలు కదిపాడట- మొగుడు ఎలాగూ వదిలేశాడు కనుక తను కట్టుకుంటానన్నాడట. స్వతహాగా తక్కువ మాట్లాడే మనిషి కనక ఏమీ మాట్లాడకుండా ఊరుకుంది చిన్నమ్మ. అది అంగీకారమనుకుని పాప అటు వెళ్ళగానే వాటువేసుకున్నాడట. అంతే. చీపురు తిరగేసింది. నెమ్మదిగా కనిపించే మనిషి తిరగబడడం కూడా విచిత్రంగా కనిపించింది నాకు. ఈ విషయం విని కల్నల్‌బాబులు పగలబడి నవ్వి, బిహారీ కడుపులో పొడిచి ఓ అరసీసా రమ్ము కానుకగా యిచ్చాడు. ఆ మర్నాడు యధాలాపంగా ఏమీ జరగనట్టు పనిలోకి వచ్చింది చిన్నమ్మ.

చిన్నమ్మ శీలానికి మొగుడు వదిలెయ్యడానికి సంబంధం లేదని ఆ సంఘటన తర్వాత తేల్చుకున్నాను. మరి వాళ్ళు విడిపోవడానికి కారణం? చిన్నమ్మలో ఏమీ కనిపించకపోయేసరికి ఆలోచన దాని భర్తవేపు మళ్ళింది. వాడిని చూస్తే నా మధనకు సమాధానం దొరుకుతుందనిపించింది. మరి పదిహేను రోజులకి ఆ హోటల్ కాంట్రాక్టరు ధర్మమా అని ఆ అవకాశం దొరికింది. సిమ్మెంటు బస్తాలు బ్లాకులో ఎవరో అమ్మారని దర్యాప్తుకి ఆంజనేయస్వామి గుడిదగ్గర నిర్మాణం జరుగుతున్నచోటకి వెళ్లాం. కంట్రాక్టరు అప్పటికే విషయం తెలిసి బెంగుళూరు పారిపోయాడు. కొరియా మార్కు ఉన్న కాగితంబస్తాలతో ఉన్న సిమ్మెంటు రెండు వందలు దొరికాయి.

"ఇవి దింపుతూండగా ఎవరయినా చూశారా?" అనడిగాను.

"మాకేం తెలీదండీ. ఆ యవ్వారాలన్నీ ఆ ఏడుకొండలుగాడికి తెలుస్తాయి." అన్నాడు పెద్ద మేస్త్రి.

చటుక్కున చిన్నమ్మ జ్ఞాపకం వచ్చింది



అనుకోకుండా ఓ ప్రశ్న అడిగాను. "వాడు చిన్నమ్మ మొగుడేనా?"

అంతా నా వంక ఆశ్చర్యంగా చూశారు- వాడి భార్యని నీకెలా తెలుసా అని, ఒక్క క్షణం బిత్తరపోయాను. "వాడి పెళ్లాం మా యింట్లో పనిచేస్తోంది సార్. ఏడుకొండలు అనగానే గుర్తొచ్చింది." అని మా ఆఫీసరుకి సంజాయిషీ చెప్పుకున్నాను

"అయితే దాన్ని రేపు ఆఫీసుకు రమ్మను. స్టేటుమెంటు తీసుకుందాం. మొగుళ్ల గోత్రాలు పెళ్లాలకి తెలుస్తాయి" అన్నాడు మా ఆఫీసరు-

"అదేంలేదు సార్. వాళ్ళిద్దరూ విడిపోయి చాలా రోజులయింది."

"ఏం? ఎందుకు విడిపోయారు?"

"అది నాకు తెలీదు సార్."

"వాళ్ళిద్దరూ భార్యభర్తలని మీకెలా తెలుసు?"

ఆఫీసరు బుద్ధి పోనిచ్చుకున్నాడు కాదు. నవ్వొచ్చింది. ఇద్దరం కలిసి ఏడుకొండలు ఉండే చోటుకి వెళ్లాం. మరీ మురికిగా ఉండే చోటు పాకల మధ్య ఏడుకొండలు యిల్లు. ఎవరో ఆ యింటిని చూపించారు. ఇంటిముందు పెద్ద మురికి గుంట. అందులో రెండు పందులు స్వైర విహారం చేస్తున్నాయి. మేం యింటిని సమీపించేసరికి లోపల్నుంచి తిట్లు వినిపించాయి. ఓ ఆడగొంతు ఏడుకొండల్ని దుమ్మెత్తిపోస్తోంది. ఆ బండగొంతులో బూతులు అతి సరసంగా పలుకుతున్నాయి.

“పనికిమాలిన యెదవా? ఏంటిరా నీ సంపాదన. పెళ్లాన్ని పోషించలేని ఎదవకి పెళ్లామెందుకు?” యిలా సాగుతోంది. మధ్యలో పెడీల్మని దెబ్బ. అడగొంతే కొట్టింది గావును. వెంటనే తిరుగుబాటు, తిట్లు. ఏడుకొండలు గొంతు వినిపిస్తుందనుకున్నాను. కాని ఏడుకొండలు పగలబడి నవ్వుతున్నాడు.

“నీ యవ్వ. ఆ పొగురుటోత్తనమేనే నీలో నాకు నచ్చింది,” అంటూ గుడిసె బయటికి వచ్చాడు. అప్పుడు చూశాను ఏడుకొండల్ని. నల్లగా కర్రిమొద్దులాగ వున్నాడు. గోచీ పెట్టుకుని ఉన్నాడు, నోట్లో చుట్ట. మరీ దగ్గరగా కత్తిరించిన జుత్తు. అతి ఉదారంగా కల్లువాసన తెలుస్తోంది. మమ్మల్ని చూసి కాస్త తత్తరపాటు పడ్డాడు.

వాడికీ సిమ్మెంటుబస్తాలకీ సంబంధం లేదని సులువుగానే తేల్చేసుకున్నాం. కాని వాడిని అబ్బురపాటుతో చూస్తూ నిలబడ్డాను. కాస్సేపటికి వాడి పెళ్లాం బయటికి వచ్చింది.

“శాయమ్మ. నా పెళ్లాం” అన్నాడు.

ఏడుకొండలు కంటె మరో ఛాయ ఎక్కువ నల్లగా ఉంది. బిర్రబిగిసిన వొళ్లు. పిటపిటలాడుతూ వుంది. మాట పెళుసు.

“ఏంటంటారు దొరలూ” అంది విసురుగా.

“నువ్వు లోపలి కెళ్లు.”

“నాకూ చెప్పు. ఎందుకొచ్చారు?” అంది మరింత కరుకుగా.

“లోపలి కెళ్లమంటే నీక్కాదూ లంజా!” అన్నాడు.

ఆ తిట్టుకి ముచ్చటగా నవ్వుకొని ఒడుపుగా ఏడుకొండల పక్కలో పొడిచి లోపలి కెళ్లింది. ఆ పోటు నాకు తగిలితే ఓ పక్క ఎముక విరిగేది– రెండు వారాలు మంచంపట్టేవాడిని. కాని ఏడుకొండలు ముసిముసి నవ్వులు నవ్వి లోపలి కెళ్తున్న పెళ్లాం వేపు కొసరు చూపులు చూశాడు. “నీ సంగతి రాత్తిరి తేలుస్తానన్నట్టు–”

వెనక్కి తిరిగివస్తూ చిన్నమ్మ, ఏడుకొండలు విడిపోవడానికి కారణం అర్థమయిందనుకున్నాను.

తన అంతస్థుకి మించి బతకడం చిన్నమ్మకి వ్యసనం. ఏడుకొండలుకి చిన్నమ్మ తన స్థాయి మనిషిలాగ కనిపించి ఉండదు– తనదికాని ఏదో ప్రపంచంలో బతికిన చికాకుపడి వుంటాడు. శాయమ్మ ఆ కరుకుదనం, ఆ బండబూతులు అదంతా తనకు తెలిసిన ప్రపంచం. ఆనందంగా, హాయిగా, సుఖంగా జీవితం సాగిస్తున్నాడు ఏడుకొండలు.

“నీ పెళ్లాం మా యింట్లో పని చేస్తోంది” అన్నాను ఏమంటాడో తెలుసుకోవాలని–

ఆశ్చర్యపోయాడు ఏడుకొండలు,

“ఎవరు బాబూ.”

“చిన్నమ్మ.”

“అబ్బో! అదా! అది ముట్టుకుంటే వాడిపోయే గాజుబొమ్మ దీనవ్వ. దాన్ని బీరువాలో పెట్టి పూజించుకునే మొగుడు కావాలి. మంచిదే కాని మన వాటం కాదండి. అదున్నప్పుడు నోరారా బూతు మాట మాట్లాడి ఎరగను” అన్నాడు.

అడవి మృగానికి ఉద్యానవనంలో ఉండడం ఎంత శాపమో మల్లెపువ్వుని మట్టిబొమ్మ సిగలో తురమడం అంతే శాపం. తనకు అక్కరలేని అంతస్థుకి ఎదిగినందుకు చిన్నమ్మ నన్ను ఇబ్బంది పెట్టింది. తనకు కావలసిన అంతస్థుకి ఒదగనందుకు చిన్నమ్మ ఏడుకొండల్ని ఇబ్బందిపెట్టింది. సంస్కారం కొందరికి పీడకల అయితే అది పీడకల అని వాళ్లు భావించకపోవడం లేదా గుర్తించలేకపోవడం వాళ్ల అదృష్టం.

